కథా కౌముది

# బాలమ్మి యెర్రం వినోద్ కుమార్



పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
కౌముది నిర్వహించిన కథల పోటీ (2023)లో
సాధారణ ప్రచురణ కథ

1994-95లో తెలంగాణ లోని ఒక ఊర్లో..

అర్ధరాత్రి చీకట్లో విరగబూసిన వెన్నెల వెలుగు ఆ ఇంటి కిటికి లోంచి లోపల నవార మంచం మీద పడుకుని ఉన్న సావిత్రి మీద పడుతుంది.. వాకిట్లో ఉన్న వేప చెట్టు మీద పడుకుని ఉన్న పక్షులన్నిటికి కావలిగా ఉన్నట్టు ఒక గుడ్లగూబా "గుబుల్ గుబుల్" అని అరుస్తూ ఉంది.. మాములుగా అయితే ఆ వెన్నెల్లో ఆ వేప చెట్టు నుంచి వచ్చే చల్ల గాలికి సావిత్రి ఎప్పుడో పడుకునేది కానీ ఈరోజు ఎంతకి నిద్ర పట్టట్లేదు, కాసేపు కళ్ళు మూసుకుని నిద్ర పోవడానికి ప్రయత్నిస్తున్న నిద్ర రాక వెంటనే కిటికిలోంచి బయటకు చూస్తూ "ఇంకెప్పుడు తెల్లారుద్దో ఎమో" అనుకుంటు మరల మరల చూస్తూనే ఉంది..

తెల్లారడం కోసం అంతలా ఎదురుచూడడానికి సావిత్రికి బలమైన కారణమే ఉంది.. తన బావ బాలమల్లు దుబాయ్ కి పోయ్ రేపటి సోమవారనికి నాలుగు వారలు అవుతూంది.. ఆ ఊరికి వచ్చే ఉత్తరాలని, వాళ్ళు పంపే డబ్బులని కూడా ప్రతి నెల మూడో సోమవారం రోజు పోస్ట్ మెన్ తీసుకుని వస్తాడు.. మళ్ళి వీళ్ళు రాసే బదులు ఉత్తరాలను నాలుగో సోమవారం తీసుకునిపోతాడు.. ఆ ఊర్లో ఈ రాత్రి ఇలాంటి అవస్థ సావిత్రిది ఒక్కదానిదే కాదు ఇంకో పదిమంది ఆడోళ్ళది కూడా ఇదే పరిస్థితి.. దుబాయ్ నుంచి తమ మొగుళ్ళు రాసే ఉత్తరాల కోసం కొందరు , తమ కొడుకులు రాసే ఉత్తరాల కోసం ఒకరిద్దరు ఎదురు చూస్తూ ఉంటారు..

పుష్కర కాలం నుంచి ఆ ప్రాంతంతో పాటు ఆ ఊరిని కూడా కరువు వెంటాడుతున్నా, దొరికిన కూలోనాలో చేసుకుంటు బతికెటోళ్ళు, కానీ గత మూడేండ్ల నుంచి ఆ పని కూడా దొరక్క పొలాలను, పశువులను కూడా అమ్మేసుకుని దూబాయ్, కువైట్, బైరన్ కి వలస పోవడం షూరు చేసారు.. సావిత్రి మొగుడు బాలమల్లు తో కలిపి ఇప్పటికి తొమ్మిది మంది వరకు పోయారు.. అక్కడున్న వాళ్ళ క్షేమసమచారం తెలుసుకోవలంటే వీళ్ళు నెలలో మూడో సోమవారం వరకు ఎదురు చూడాల్సిందే..!

సావిత్రి మేనత్త కొడుకు బాలమల్లు.. సావిత్రి పుట్టగానే పెద్దోళ్ళంత బాలమల్లుగాని పెళ్ళాం పుట్టిందన్నారు.. వాళ్ళు పెరుగుతున్నట్టే వాళ్ళ మధ్య ప్రేమ పెరుగుతూ పోయింది.. బాలమల్లుకు తొమ్మిదేళ్ళ వయసులోనే అమ్మ చనిపోయింది.. అప్పుడ్నుంచి సావిత్రిని ప్రేమగా వాళ్ళమ్మను పిలిచినట్టే "బాలమ్మి.." అని పిలిచేటోడు.. బాలమల్లు చిన్నప్పుడు ఆ ఊరి పటేలు బర్లు కాసిన, జర పెద్దయినంకా వాళ్ళ అయ్యా యాదయ్యతో కలసి తమకున్న ఏడు గుంటల భూమి సాగుచేసోటోడు.. వాళ్ళయ్య ఇచ్చిన అణా పైసలు దాచిపెట్టి సావిత్రి పెద్దమనిషి అయ్యేనాటికి గుర్జెత్తు ముక్కుపుల్ల చేయించి ఇచ్చాడు.. సావిత్రి ఆ ముక్కుపుల్ల పెట్టుకుని "మా బావ చెపిచ్చుండు.." అని అందరు ముంగట మురిసిపోయేది..

ఒక మంచి రోజు చూసి సావిత్రికి, బాలమల్లుకు పెళ్ళి ఖాయం చేసారు.. బాలమల్లుకు పెళ్ళిలో రెండు తులాల బంగారం, ఒక అట్లాస్ సైకిలు, ఒక చేతి గడియారం, రెండు చెద్దర్లు, ఒక బూరు తువ్వాల కట్నంగా ఇస్తానని సావిత్రి అయ్యా ఎల్లయ్యా ఒప్పుకున్నాడు..

"బిడ్డకు మన ఇండ్లల్ల ఓళ్ళకు ఇయ్యనంత ఉండవాను (కట్నం) ఇస్తుండు, రేపొద్దుగల్ల మన పిల్లలకు లగ్గం జెయ్యాలన్న గంతె ఇయ్యుమంటరు" అని అందరు కొపానికి వచ్చిన, ఎల్లయ్య అదేం పట్టించుకోకుండా "నాకున్నది ఒక్క పిల్ల ఇప్పుడు కాకపోతే మళ్ళెప్పుడు పెడ్తా.." అని తన పొలంలో పెద్ద సగం అమ్మి మరి పెళ్ళి ఘనంగా చేసిండు.. పెళ్ళిలో సావిత్రి, బాలమల్లు జంటను చూసి "ఎంత గమ్మతున్నరు.." అంటు వచ్చినవాళ్ళు దీవించి పోయారు..

సావిత్రి పెళ్ళి చేసుకుని బాలమల్లు ఇంటికి వచ్చింది.. ఆ కొత్తజంట ముద్దు ముచ్చట్లు, ఆటపాటలతో ఉండడం చూసి తండ్రి యాదయ్యా కూడా మురిసిండు అలా చూస్తూ ఉండగానే వాళ్ళ లగ్గమై నాలుగు నెలలు గడిచింది..

ఊర్లో అందరు ఎదురు చూసినట్టే బాలమల్లు కూడా వాన కోసం చూసిండు.

ఒక బొట్టు కూడా పడలే, ఇంకా ఎదురు చూడాలేకా తన దగ్గర ఉన్న సొమ్మంత తీసి, ఇంత అప్పు చేసి మరి రెండు బావిలు తవ్విస్తే కక్కేడు నీళ్ళు కూడా రాలే, ఇంకా ఇక్కడే ఉంటే కాలం లేక ఆకలి చావు తప్పవని తాను కూడా దూబాయ్ పొదామనుకుని యాదయ్యకు చెప్తే "కొత్తగ లగ్గమైన పోరనివి, గీన్నె ఇంత కూళి జేసుకుని, కలోగంజో తాగుతూ కట్టుకున్న దానితోని కూడి ఉండకా బయటవోయి ఏం జేస్తవ్ రా.." అని యాదయ్యా కోపానికి వచ్చి బెదిరించాడు.. రోజు ఈడ చెద్దమన్న పని దొరకకా బాలమల్లు పడుతున్న అవస్థ చూస్తున్న సావిత్రి తన మామ

యాదయ్యను ఒప్పించింది.. యాదయ్య ఒప్పుకోగానే బాలమల్లు దూబాయ్ పోనికి పైసల కోసం కోమటయిన దగ్గర పొలం కుదవెట్టి తెద్దామనుకుంటుంటే సావిత్రి ఆపి, తన బంగారం అంత ఇచ్చేసి అమ్మేయమన్నది.. బాలమల్లు ఆ బంగారంతో పాటు, సైకిలు, గడియారం, రెండు ఎడ్లు అన్ని అమ్మేసి దూబాయి పోయిండు.

బాలమల్లు వెళ్ళాక రాస్తున్న మొదటి ఉత్తరం రేపు రాబోతుంది.. అందుకే ఎప్పుడు తెల్లారుతుందా అని సావిత్రి చూస్తూ జల్ది తెల్లారనియమ్మాని బద్దిపోషవ్వకు మొక్కుతుంది..

సావిత్రి ఆ ఉత్తరం గురించే ఆలోచిస్తూ "అవునూ, మా బావకు కూడా నాలెక్కనే సదువు రాదు కదా, మరి కారట్ (ఉత్తరం) ఎట్ల రాస్తాడో ఎమో, భుజంగం సేటు లెక్క ఆడ సుత ఎవలన్న ఉంటరా.." అని అనుకుంటునే "రాశటోళ్ళు లేరని బావ రాయకూండా ఊకుంటే ఎట్లా.." అనే ఆలోచనకే తన మొహం చిన్నబోయి కళ్ళల్లో నీళ్ళు తిరిగినయి, వెంటనే "బద్ది పోశమ్మ తల్లి, ఆడ కూడా భుజంగం సేటు లెక్క ఎవలన్న ఉండేట్టు సూడూ, రేపే వచ్చి కల్లు తోని బద్దులు నింపుతా..!" అని కళ్ళు మూసుకుని చెంప లేసుకుంటా మొక్కుకుని తలాబుకు పెట్టుకున్న నీళ్ళు కొన్ని తాగి పడుకోవడానికి కళ్ళు మూసుకుంది కానీ ఎప్పటిలానే తనకు నిద్ర పట్టట్లేదు..

ఈ సారి తను వాళ్ళ బావ కు ఏమని బదులు ఉత్తరం రాయలని ఆలోచిస్తూ "బావను సూడాలని పాణం ఎంత గుంజుతుందో రాయలి, 'బాలమ్మి..' అని నోటి నిండా పిలిచే ఆ పిలుపు కోసం గుండెంత కొట్టుకుంటుందో రాయలి, అయ్య,అవ్వ మీద పాణం గుంజి రంధితో కుసుంటే దగ్గరకి తీసుకుని అలుముకునే బావను గట్టిగ అలుముకోవాలని ఉందని రాయలి.." అని రకరకాలుగా ఆలోచిస్తూ ఆ చల్లగాలికి తనకు తెలియకుండానే పడుకుంది.

తెల్లారగానే వాకిట్లో పడుకున్న మామ కన్నా ముందే లేచి ఇళ్ళు వాకిలి నూకేసింది.. యాదయ్య పాలు పిండుకుని రాంగానే ఛాయ్ చేసి మామకు పోసి పొయ్యి కాడ పనులన్ని జల్ది జల్ది జేసుకుని పోస్ట్ మేన్ కోసం ఎదురుచూస్తూ కూర్చుంది..

ఆ పోస్ట్ మేన్ ఎప్పుడస్తడా అని ఇంట్లకి బయటకి తిరుగుతూ ఉంది.. అందరికి ఇచ్చి తనకు మర్చిపోయండెమో అని పక్క సందుల ఉండే మంజుల దగ్గరకి కూడా రెండు సార్లు పోయి వచ్చింది.. ఇంట్ల లోపల కూసుంటే పోస్ట్ మేన్ వచ్చేది కనవడదని గైండ్లనే (గుమ్మం) దగ్గరే కూర్చుంది.. ఇంతలో సైకిల్ బెల్ కొట్టుకుంటు పోస్ట్ మేన్ వచ్చి "బాలమల్లు.." అని పేరు చదవడం కూడా పూర్తి కాకముందే సావిత్రియే ఎదురెల్లి "ఆ అన్న, బాలమల్లు మా బావనే.." అనగానే పోస్ట్ మేన్ తన చేతిలో ఉన్న పెన్ను తో సావిత్రీ బొటనవేలు మీద గీకి తన చేత వేలి ముద్ర వేయించుకున్నాడు.. వేలి ముద్ర వేయగానే ఆ బొటనవేలును తల వెంట్రుకలకు రుద్దుకుంటు ఆ ఉత్తరం తీసుకుని మంజుల దగ్గరకి పరిగెత్తుకు పోయింది.. "మంజులక్క, కారట్ అచ్చింది, కోమటి సేటు దగ్గరకి పోయి సదివిపిచ్చుకుందమా..!?" అని అడిగితే మంజుల "నేనే నీ దగ్గరకి అస్తున్న, ప పోదాం.." అని ఇద్దరు చెరో ఉత్తరం పట్టుకుని బయల్దేరారు

సుమారు యభైఐదేళ్ళ పై బడిన వయసుగల భుజంగం సేటు నిండు నీళ్ళ కుండా లాగా బొర్రవేసుకుని, బియ్యం దాచే గుమ్మి లెక్క గుండ్రంగా, పొట్టి గా ఉంటాడు.. ఆ ఊళ్ళే చదువు వచ్చినవాడు ఒక్కడే కావడంతో ఆఊళ్ళె ఎవరికి ఏది రాయలన్న అతనే దిక్కు భుజంగం భార్య, కోడుకులు పట్నంలో ఉంటారు.. అతను ఇక్కడ ఒక్కడే ఉంటూ అవసరానికి పొలం కుదపెట్టుకుని అప్పులు ఇస్తుంటాడు.. అతనితో ఏదైనా పని ఉందని పోతే ముందు తన పని చేయించుకున్నాకే వాళ్ళ పని చేసేటోడు. భుజంగం సేటు ఇంటి వరండాలో అరం కూర్చిలో కూర్చుని అంబలి తాగుతూ ఉన్నాడు..

మంజుల రాగనే తన చేతిలో ఉన్న ఉత్తరాలను చూసిన భుజంగం సేటు "ఇయ్యాల గాదు, రేపు పగలుకు రండ్రి.." అని చెబుతుంటే "అయ్యో, సేటు జర సదువు కదా, పొద్దట్నుంచి నీ కొరకే జూస్తున్నం.." "చెప్పిన గదనే రేపు రమ్మని దెంగెయ్ ఇడ్కెంచి.." అని చీదరించుకుంటున్నాడు.. "అయ్యో, సేటు గట్లనకు ని కాల్మొక్త, నా మొగుడు మునపటి కారట్ల పాణం ఉషార్లేదని రాసిండు ఇప్పుడు ఎట్లుండో ఎమో జర సదువు పెట్టు సేటు.." అని బతిమాడుతుంటుంటే కోపం వచ్చిన భుజంగం తన చేతిలో ఉన్న చెంబును విసిరి కొడితే అది మంజుల పక్కకున్న దర్వాజకు తగిలి కిందపడింది,

"చెప్తె ఇనవడ్తలేదయే ముండా, మపటి దాక గూడా ఆగేటట్లు లేవు, మొగుని మీద అంత గుంజుతుందా, రేపు కూడా సదువా, ఎల్లుండి రాపో పో.." అంటే మంజుల కళ్ళలోకి నీళ్ళు తెచ్చుకుని "జర కోపానికి రాకు సేటు, రేపైతే రేపే వస్త గని" అంటు సావిత్రిని తీసుకుని వెళ్ళిపోతుంటే "ఓ సాకల్దన ఎటు పోతున్నవే, ఇదంత ఎవలు తూడుస్తరు.." అనగానే మంజుల తన ఉత్తరాన్ని సావిత్రికి ఇచ్చి కొంగుతో కిందపడ్డ అంబలిని తూడుస్తుంది.. భుజంగం సావిత్రిని చూస్తు "గిదోళ్ళ పిల్లనే..?" అని అడిగితే మంజుల " గొల్ల బాల మల్లు గాని పెండ్లాం సేటు.." అనగానే పటేలుకు గుర్తొచ్చి "అరేరే, మొన్ననే లగ్గమైంది గదు." అంటు సావిత్రిని కిందకి మీదకి చూస్తుంటే సావిత్రి అవునన్నట్టు తలకాయా ఊపింది.. కింద పడ్డ అంబలి తూడ్వడం అయిపోయిన మంజుల "సేటు, నీ కాల్మొక్త జర కారట్ల ఏముందో సదువు సేటు, నెల నుంచి నా మొగుడి పాణం ఎట్లుందో అని నా పాణం ఆగమైతుంది.." అంటే సేటు "లగ్గమై ఆర్నెళ్ళు కాలేదు, అంటుడు, ముట్టుడు లేక గా పిల్ల పాణం ఆగమైతుందంటే ఓ లెక్క, ముగ్గురు పిల్లల్ని గన్నవ్ నీ పాణం ఇంకా ఆగమైతుందా, ఇటియ్.." అని ఉత్తరం కోసం చెయి చాచాగానే మంజుల ఉత్తరం ఇచ్చింది.. ఆ ఉత్తరం ఒకేసారి తీసి మొత్తం చూసి, ఆ ఉత్తరాన్ని మడుస్తూ

"హ్మ్మ నీ మొగుడి పాణాం ఉషారైందంట, వారం నుంచి పనికి పోతున్నడంట, అందర్ని అడిగినట్టు జెప్పమన్నడు, మళ్ళా తాపకు పైసలు పంపుతడంట ముందుగల్లా నాగట్టి మిగుళ్తె మందికి గట్టుమన్నడు.." అని చదవగానే ఉత్తరం చదివినందుకు ఆనందపడుతునే, చదవడం అయిపోగానే చిన్న బాదతో "గంతే రాసిండా సేటు.." అంటే ఆ ఉత్తరాన్ని తీసి మంజుల మొహానికి కొట్టి "ఇగో నువ్వే చదువుకపో.." అని అంటూ "నీదిటియ్.." అనగానే సావిత్రి తన చేతిలో ఉన్న ఉత్తరం ఇస్తుంటే సావిత్రి చేతులను తడుముతూ తీసుకున్నాడు.. సావిత్రి అదేం పట్టించుకోకుండా

ఉత్తరంలో ఏమి రాశాడో అని ఆశగా చూస్తూ ఉంది.. ఆ ఉత్తరం కూడా తెరిచి మొత్తం చూసి.. "నీ మొగుడు కూడా మంచిగుండంట, జర అల్కటి పనే దొరికిందంటా, ఏమి రంధి పెట్టుకోకు పయిలం అని రాసిండు.." అంటు ఉత్తరం చదివి సావిత్రి కి ఇచ్చాడు.. తన బావ ఎన్నో ముచ్చట్లని చెప్తడని రాత్రంత కలలు కన్న తనకి, సేటు నాలుగు ముక్కలే చదివేసరికి ఒక్కసారిగా గుండె బరువెక్కినట్లైంది కానీ, వెంటనే "పోని తీయ్ మంచిగున్నడంట, మంచి పని దొరికిందంట గదే పదివేలు.." అని తనలో తనే నచ్చజెప్పుకుంది.. సావిత్రిని కిందకి మీదికి చూస్తున్న పటేలు "ఓయ్ పోరి, ఎమన్న అవసరముంటే రాయే.." అని చెప్పాడు.. ఆ మాటల వెనుక మర్మాన్ని అర్థం చేసుకున్న మంజుల వెంటనే సావిత్రిని తీసుకుని అక్కడ్నుంచి బయల్దేరింది..

సావిత్రి, మంజుల ఇంటికి వెళ్తు, మంజుల పచ్చిగ అయిన తన కొంగు పిండుతూ "హమ్మాయ్యా, పాణమైతే ఉషారైందంట, రేపేబోయి బద్ది పోషవ్వకు రొండు కొబ్బరికాయాలు కొట్టిరావలి.." అని అంటుంటే సావిత్రి మాత్రం బాలమల్లు పంపించిన ఉత్తరని తెరిచి చూస్తుంది.. మంజుల"ఏందే ఇంకా ఆ కారట్ నే జూస్తున్నావ్.." అనగానే సావిత్రి "గీ కాయిదం మొత్తం రాతలే కనిపిస్తున్నయి, గా సేటు గాడేమో మూడు ముక్కలు గూడ సదవలేదేందక్క.." అంటే మంజుల "ఆన్ కోమటి నోట్ల మన్నువడా, ఆడు అంతే, ఏం జెద్దం ఈ ఊళ్ళె ఇంకోడు సదువుకున్నోడు లేకపాయే, మనకేమో సదువు రాకపాయే, ఇగ గాడు ఏది సదివితే గదే రాసిండనుకుని రావలే మనం.." అని మంజుల చెబుతుంటే సావిత్రీ ఆ ఉత్తరన్ని మడతవెట్టు "మరీ పాపమున్నడు ముండకొడుకు.." అనుకుంటు ఇంటి దాక వచ్చేసారు..

సావిత్రి ఇంట్లోకి వచ్చింది చూసిన యాదయ్యా "ఆడు మంచిగున్నడంటన్న, బిడ్డా.." అని అడిగితే "ఆ మంచిగుండంట మామ, పని సుత అల్కగనే దొరికిందంట" అని చెబుతూ బిందెలకెళి నీళ్ళు ముంచుకుని గట గట తాగుతుంది.. "మంచిగుండి జర కదర్ మీద పన్జెస్కుంటే సాలు.." నీళ్ళు తాగడం అయిపోయిన సావిత్రి " ఆ మంచిగనే జెస్కుంటుండంటే, నీ పాణాం పయిలం అని జెప్పిండు, ఏం రంధి పెట్టుకోకుండా యాలకు తినమన్నడు.." అని చెబితే యాదయ్య సరే అన్నట్టు తలూపిండు.

బాలమల్లు పంపించిన ఉత్తరాన్ని కూరడ్ల (కూరాడు కుండ) దాచిపెడుతూ "కారట్ కోసం నేను ఇంత ఎదురుజూస్తుంటే నాలుగు ముక్కలే రాసిండు జూడు.." అని కోపంగ గుణుగుతు ఈ సారి తాను రాసే ఉత్తరంలో ఇది కూడా అడగాలి అనుకుంది కానీ, "ఆ కోమోటోడు ఒక్కో మాట రాయనికి రూపాయి తీసుకుంటడు.. పోతే వాయే అని పైసలు అని నాలుగు మాటలు రాయమంటే మనల్ని ఇష్టమొచ్చిన మాటలు అంటడు.. ఎందుకొచ్చిన ఘోష మనం మంచిగున్నం అని ఒక మాట రాస్తే సాలు.." అని మంజుల చెప్పిన మాటలు గుర్తొచ్చాయి.. దేశం కానీ దేశంలో ఉన్న మొగుడితో నాలుగు మాటలన్న రాయనికి లేదు, అంటు తనలో తను బాదపడ్తు "పాడువడ్డ సదువు నేనన్న సదుకోకపోతీ, ఆ బడే ఊళ్ళె ఉంటే నేను కూడా సదువుకుంటుండే.." అని తనను తాను తిట్టుకుంది..

బాలమల్లు దుబాయ్ కి వెళ్ళి ఐదు నెలలు గడిచాయి.. బాలమల్లు సంపాదించిన దాంట్లోంచి కొన్ని నెల నెల ఇంటికి పంపుతున్నాడు.. ఆ పైసలన్ని యాదయ్య భద్రంగ దాస్తున్నడు.. ఈ ఐదు నెలల్లో ఎప్పుడైన సావిత్రికి ఒంట్లో బాలేక తన బావ ఎంతో గుర్తొచ్చి ఉత్తరంలో రాద్దమనుకున్న ఆ సేటుకు భయపడి రాసేది కాదు.. ఉత్తరం కోసం పోయిన ప్రతిసారి భుజంగం సేటు ఇంట్లోపని చేయించుకునేవాడు.. ఓ రోజు ఉత్తరం రాయమని పోతే కాలు బెణికింది నూనే రాయమని చెప్పాడు.. సావిత్రి నూనే రాస్తుంటే కొంగు పట్టి లాగాడు.. సావిత్రి ఉత్తరం కూడా రాపియ్యకుండా ఏడుస్తూ పరిగెత్తుకు వచ్చింది. ఇలాంటివి ఎన్ని చేసిన "పాపిష్టోడు, పురుగుల వట్టి పోతడు.." అనుకుంటు అందరు తిట్టుకునేవాళ్ళే కానీ, మళ్ళీ ఉత్తరం చదివించుకోవడం కోసం వాడు ఏ పని చెబితే ఆ పని చేసేటోళ్ళు, రాను రాను సావిత్రికి బాలమల్లు దగ్గర్నుంచి ఉత్తరం వస్తుందన్న ఆశ కన్న ఆ భుజంగం దగ్గరకి పోవాలి అనే భయమే ఎక్కువేసేది.. ఆడి గురించి ఊరిలో ఎవరికైనా చెబుదామంటే వాణ్ణి ఎదురించేటోళ్ళె లేరు, కాదని ఎదురిస్తే ఉత్తరాలు చదివే వాళ్ళు ఉండరాని వాళ్ళందరు ఎంత బాదనైన భరించేవాళ్ళు..

ఓ రోజు బాలమల్లు పంపిన పైసలన్ని యాదయ్య, సావిత్రికి ఇస్తూ "ఊళ్ళె బీరప్ప పండగ వస్తుంది బిడ్డ, నీ పెయ్యి మీద తులం బంగారమైన లేకుంటే అచ్చే సుట్టాల ముందు ఇకారం తక్కువైతది, గీ పైసలతోని ఇంత బంగారం జేయించుకో.." అని ఇచ్చాడు. "కట్టేటి అప్పులు మస్తుగున్నయ్ మామ, గిప్పుడు బంగారం ఎందుకు.." అంటే మామ "అబ్బో బోడి అప్పు, గిట్లనే కష్టం జేస్తే యాడాదిలా ఆ అప్పు అటు, మనం ఇటు.." అని బలవంతంగా పైసలు ఇస్తూ మంజులతోని పట్నం పోయి కొనుక్కోమన్నాడు..

ఓ రోజు పొద్దుగల్లనే సద్ది పెట్టుకుని సావిత్రి, మంజుల ఇద్దరు పట్నం బయల్దేరారు.. వాళ్ళ ఊరి నుంచి మూడున్నర గంటలు ప్రయాణం చేసాక పట్నం చేరారు.. సావిత్రి ఎప్పుడో చిన్నప్పుడు పట్నం వచ్చింది, మళ్ళీ ఇన్నేళ్ళకు వచ్చింది.. పట్నంలో కార్లు, బండ్లు, ఇక్కడ మనుషులు, వాళ్ళ బట్టలను వింతగ చూస్తూ ఉంది..

ఇద్దరు కలిసి మంజులకు తెలిసిన అవుసులయిన షాప్ (జ్యువెలరి షాప్) కి వెళ్ళారు.. వీళ్ళకి కావల్సిన బంగారం తెమ్మని షాపతను పనిపిల్లావాడి ఇంకో చోటుకు పంపించాడు.. మంజుల, సావిత్రి అక్కడే కూర్చుని ఉన్నారు, వీళ్ళ ముందు షాపతను కూర్చుని ఉన్నాడు.. షాప్ లో ముగ్గురే ఉన్నా సావిత్రికి ఎక్కడ్నుంచో ఆడ గొంతుతో పాడుతున్న పాట వినిపిస్తుంది.. ఆ పాటతో పాటు మ్యూజిక్ కూడా వినిపిస్తుంది.. ఆ చప్పుడు ఎక్కడ్నుంచి వస్తుందో అర్థం కాక సావిత్రి షాప్ అంత చూస్తుంది.. సావిత్రినే అబ్జర్వ్ చేస్తున్న షాపతను " ఏం లెంకుతున్నవమ్మా..?" అని అడిగాడు..

సావిత్రి "అప్పణ్ణుంచి పాటలు ఇనవడ్తున్నయి, ఓలు పాడ్తున్నార అని చూస్తున్న..!?" అని అడిగితే షాపతను నవ్వుతూ "ఓహ్, అదా... ఇగో దీంట్ల నుంచి వస్తుంది.." అని అప్పటివరకు కింద ఉన్న ఒక రెడ్ కలర్ టేప్ రికార్డర్ నీ తీసి వీళ్ళు ముందు ఉన్న టేబుల్ మీద పెట్టాడు.. సావిత్రి దాన్ని ఆశ్చర్యంగా చూస్తూ దాన్ని ముట్టుకుని "దీంట్లో ఉండి పాడుతున్నారా.." అని అది తీసుకుని చెవి దగ్గర పెట్టుకుంది.. ఇప్పుడు దాంట్లోంచి మగ గొంతులో పాట

వినిపిస్తుంది.. సావిత్రి వెంటనే ఆ టేప్ రికార్డర్ ని తీసి అక్కడ పెడ్తు “దీంట్లో మగయిన కూడ ఉన్నట్టుందు..” అనగానే షాపతను మళ్ళీ నవ్వి “అండ్ల ఎవలు ఉండరమ్మా..” అని ఆ పాట ఆపేసి దాంట్లోంచి క్యాసేట్ బయటకు తీసి “ఇగో గిదే పాడుతది..” అని చూపించాడు.. సావిత్రి క్యాసెట్ ని అశ్చర్యంగా చూస్తు అమాయకంగా “గిదేట్ల పాడుతది..” అని అడిగితే “గిది పాడది, హైద్రావాద్ల వేరేటోళ్ళు పాడుతరు, వాళ్ళు పాడిన దాన్ని గీ క్యాసేట్ల రికార్డ్ చేసింద్రు, అది మనం గీ టేప్ రికార్డ్ లా యేసుకుని ఇనచ్చు..” అనగానే సావిత్రి ఒకింత ఆశ్చర్యంగా చూస్తూ “అవునా ఆళ్ళు ఏం పాడిన మనం ఇనచ్చా..?” “ఎవరేం పాడిన, మాట్లాడిన దీంట్లనే రికార్డ్ చెయ్యొచ్చు, మనం ఇనచ్చు..” అని టేప్ రికార్డ్ లో రికార్డ్ బటన్ నొక్కి “నీ పేరెంది..?” అని అడిగితే “సావిత్రి..” అని అనగానే బటన్ ఆపేసి క్యాసెట్ బ్యాక్ వర్డ్ చేసి ప్లే చేసాడు అందులో సావిత్రి మాట్లాడింది వినిపించింది.. సావిత్రి మాటలను ముచ్చటగా వింటు “ఇది మనం ఈడ మాట్లాడి ఓలకు పంపిన ఇంటరా..” అంటే “ఆ.. వాళ్ళ దగ్గర కూడా టెప్ రికార్డర్ ఉంటే వినొచ్చు..” అని చెబుతుంటే వెంటనే ఆనందంతో సావిత్రి “ఎంతుంటది అన్న గిది..?” అని అడిగింది..

సావిత్రి ఉత్సాహం చూసిన షాపతను “అబ్బో దీనికి బాగ పైసలు కావలి, ఇగో నువ్వు బంగారం కొంటున్నంత పైసలు కావలి..” అన్నాడు.. సావిత్రి ఏ మాత్రం ఆలోచించకుండా “నాకు బంగారం అద్దు అన్న, గీ టేపే ఇయ్యి..” అనగానే అది విన్న మంజుల “ఓ పిసదాన, గదేం జేసుకుంటవే..” అని తిడ్తున్న అదేం పట్టించుకోకుండా “అన్న ఇగో గీ పైసలన్ని తీసుకుని నాకు గిసోంటి క్యాసెట్లు ఐదారియ్యి,,” అని బతిమాడింది.. ఆ షాపతను కొన్న దానికంటే ఎక్కువ డబ్బులు వస్తున్నాయని ఆశతో సావిత్రి అడిగినన్ని క్యాసెట్లు ఇచ్చి ఆ టెప్ రికార్డర్ ఎట్ల వాడాలో చూపించి ఇచ్చేసాడు.. సావిత్రి చేస్తున్న పని ఏం అర్థం కానట్టు చూస్తున్న మంజుల “ఇంటికి పోయినంక ఇది కొన్నవని తెలిస్తే మీ మామ తంతడు జుడు..” అని చెబుతున్న సావిత్రి ఆ టెప్ రికార్డర్ ని కొంగులో దాచుకుని భుజానా ఎత్తుకుని కన్న బిడ్డను ఎత్తుకున్నంత మురిసిపోతుంది..

సాయంత్రం ఇంట్లో యాదయ్యకు ఆ టేప్ రికార్డర్ ను చూపించి జరిగింది చెప్పిన సావిత్రిని యాదయ్య కోపంగా “బోడి మెడతోని ఉందని, ఇడ కట్టే అప్పు ఇడ్సి మరీ, పైసలిస్తే గిది కొన్నవా..” అంటూ “మొగుడు ఇల్లు ఇడ్సి దేశాలు పట్టుకుని పోతే సుఖానికి మరిగిన ఆడది గిట్లనే తయరైతది.. మీరేందో, మీ సంసారమెందో థూ..” అని తిడుతూ ఇంట్లోంచి బయటకి వెళ్ళాడు.. మామ మాటలకి ఒకంతకు బాదనిపించిన ఉత్తరాల కోసం ఆ సేటు దగ్గర పడే బాదల ముందు తక్కువే అనిపించింది..

ఇంట్లో రాత్రి ఆ టేప్ రికార్డర్ పెట్టుకుని ఆ షాపతను చెప్పినట్టు దాంట్లో క్యాసెట్ వేసి రికార్డ్ బటన్ నొక్కి “బావ., మంచిగున్నవనే..!?” అని మాట్లాడి మళ్ళీ బ్యాక్ వర్డ్ చేసి ప్లే చేస్తే తను మాట్లాడిన మాటే వినిపించేసరికి సావిత్రి ఆనందంతో కళ్ళలోకి నీళ్ళు తిరిగాయి..

ఆ మాటనే మళ్ళి మళ్ళి వింటు తన బావను అలుముకున్నట్టు ఆ టేప్ రికార్డర్ ని తీసి గుండెలకు అలుముకుని మురిసిపోయింది.. ఇక తన బావతో మాట్లాడడానికి ఆ కోమోటోని దగ్గరకి పోవాల్సిన అవసరం లేదు, ఆడు చేప్పె పాడు పనులు చేయక్కర్లేదు.. నాకు, నా బావకు మధ్య ఇంకో మనిషి అవసరమే లేదు అనుకుంటు ఆనందపడుతుంది.. ఇక ఆ టేప్ రికార్డర్ ఆన్ చేసి తన బావకు ఇన్ని రోజుల్నుంచి చెప్పాలనుకున్న మాటలన్ని మురిపంగా చెబుతుంది.. తను బంగారం కొనకుండా టేప్ రికార్డర్ కొన్న విషయం, తాను అది ఎందుకు కొనాల్సి వచ్చిందో చెబుతూ “ఆ కోమటి ముండకొడుకు నా కొంగు గుంజిండని నీకైతే జెప్పుకుంటగని, అందరికి ఎట్ల చెప్పుకోను బావ..” అంటు ఏడుస్తు చెప్పింది.. అలా అన్ని విషయాలను రికార్డ్ చేసి ఒకటికి రెండు సార్లు విన్నది..

ఆ క్యాసెట్ ని పక్కలోనే పెట్టుకుని పడుకుంది..

తెల్లారి ఉత్తరాల కోసం వచ్చే పోస్ట్ మేన్ కి మూడు రూపాయాలు ఇచ్చి ఆ క్యాసేట్ ని తన బావకు పంపమన్నది, ఆ పోస్ట్ మేన్ తీసుకున్నాడు..

క్యాసేట్ అయితే పంపింది కానీ తిరిగి బావ నుంచి బదులు రావడం కోసం నెల రోజులు ఎదురు చూడాల్సిందే, ఈ లోగా తను బంగారం కొనకుండా టేప్ రికార్డర్ కొన్న విషయం ఊర్లో అందరికి తెలిసి “ఆడ మొగుడు జేసే కష్టం ఇడా కుసొని తినే ఆడదానికి ఏం తెలుస్తది గట్లనే ఖర్సు పెడుతారు ..” అంటు ఒక్కొక్కరు ఒక్కో మాట అంటున్నారు.. సావిత్రి అమ్మనాన్న కూడా “బంగారం ఉంటే అక్కరకు వస్తది, గిది (టేప్ రికార్డర్) కొని పైసలన్ని కరబ్ చేసింది..” అంటూ తిట్టారు.. ఊర్లో జరిగే బీరప్ప పండుగకు కూడా సావిత్రి బోడమేడతోనే ఉంది.. ఊర్లో అందరన్న మాటలకు సావిత్రి ఎంతో బాదపడింది.. వాళ్ళు అనే మాటలు వినిపించి చాలసార్లు ఏడ్చింది కానీ తను చేసిన పనిని ఎనాడు తప్పుగా అనుకోలేదు

ఆ రోజు మూడో సోమవారం ఊర్లోకి వచ్చే పోస్ట్ మేన్ కోసం ఎదురు చూస్తుంది సావిత్రి.. పోస్ట్ మేన్ వచ్చి ఊర్లో అందరికి ఉత్తరాలు పంచుతున్నాడు.. తన క్యాసేట్ కోసం ఎదురు చూస్తు ఉంది సావిత్రి, కానీ తనకేం ఉత్తరాలు రాలేదని పోస్ట్ మేన్ చెప్పేసరికి సావిత్రి ఒక్కసారిగా

కట్టె సర్చుకు పోయింది.. కాళ్ళ కింద భూమి కదిలినట్టైంది.. ఇంట్లో ఆ టేప్ రికార్డర్ ను చూస్తూ బోరున ఏడుస్తూ “ఊళ్ళె వాళ్ళ లెక్కనే తన బావ అనుకుని తను చేసిన పని గురించి కోపంగా ఉన్నడేమో..” అనుకుంటు రాత్రంత ఏడుస్తునే ఉంది..

తెల్లారి నలతగానే సావిత్రి నిద్ర లేచింది.. రోజు ఉదయం ఎంతో సందండిగా అందరిని పలకరించే సావిత్రి ఆరోజు వాకిలి నూకేసి యాదయ్య కు ఛాయ్ పెట్టిచ్చి వెళ్ళి మళ్ళి పడుకుని కళ్ళు మూసుకుంది రాత్రంత ఏడ్చినందుకు కాబోలు ఈ సారి కళ్ళు మూసుకోగానే గాడ నిద్రలోకి వెళ్ళింది..

మధ్యాహ్నం యాదయ్య ఇంట్లోకి వస్తూ "ఓ పోరి, సావిత్రి..? ఏడున్నదో..? ఇగో మందోళ్ళ నర్సిగాడు అచ్చిండు.." అని పిలుస్తున్న సావిత్రి పలకడం లేదు ఈసారి "సావిత్రి.." అని గట్టిగ పిలిచేసరికి పడుకుని ఉన్న సావిత్రి ఠక్కున ఉలిక్కిపడి లేచి బయటకి వచ్చి చూస్తే "మంచిగున్నవా వదినే..!?" అని నర్సింలు పలకరించాడు.. అతణ్ణి చూసిన సావిత్రి "అగో దుబాయ్ కెలి నువ్వెప్పుడొచ్చినవోయ్.." అంటే "రెండ్రోజులు అయితుంది వదిన.." అని నర్సింలు అంటు తన బ్యాగ్ లోంచి ఒక ప్యాకెట్ తీసి సావిత్రికి ఇస్తూ "ఇగో అన్న పంపించుండు వదిన" అని ప్యాకెట్ ఇచ్చాడు.. సావిత్రి ఆ ప్యాకెట్ తీసుకుని నర్సింలు కు ఛాయ్ పెట్టించింది.. అది తాగి కాసేపుండి నర్సింలు వెళ్ళిపోయాక సావిత్రి ఆ కవర్ తీసి చూస్తే అందులో కొన్ని వస్తువులతో పాటు ఒక క్యాసెట్ కూడా ఉంది.. ఆ క్యాసెట్ చూడగానే సావిత్రికి ప్రాణం వచ్చినట్టైంది.. వెంటనే టేప్ రికార్డర్ తీసి అందులో క్యాసెట్ వేసి ప్లే చేయగానే "బాలమ్మ.. మంచిగున్నవాయే..!?" అని తన బావ గొంతు వినిపించింది.. ఇన్ని రోజులకు తన బావ గొంతు వినిపియ్యాగానే తన బావనే ముద్దాడినట్టు ఏడుస్తూ ఆ క్యాసెట్ ను ముద్దాడింది.. ఆ మాట వినగానే సావిత్రి కళ్ళలోకి నీళ్ళు తిరిగాయ్ ఆ క్యాసెట్ మొత్తం మురుస్తూ విన్నది..

ఆ క్యాసెట్ గురించి తెలుసుకున్న ఊరి వాళ్ళు ఇక తమ వాళ్ళకు ఉత్తరాల కోసం భుజంగం దగ్గరకి వెళ్ళడం మానేసారు.. అందరు సావిత్రి దగ్గర్నుంచి టేప్ రికార్డర్న్ తీసుకువెళ్ళి క్యాసెట్ రికార్డ్ చేసి పంపించేవాళ్ళు, దూబాయ్ నుంచి కూడా ఉత్తరాలకు బదులు క్యాసేట్లు రావడం షూరు అయ్యింది.. ఇక ఆ ఊర్లో తమ వాళ్ళతో మనుసులో మాటలు చెప్పాడానికి మద్యలో ఇంకో మనిషి అవసరం లేకుండా పోయింది..

★★★

COMMENTS